ప్రజాశక్తి
ఆదివారం 2 నవంబర్ 2025



కాశీబుగ్గ ఘటనపై సిపిఎం దిగ్భ్రాంతి

ప్రజాశక్తి-పాడేరు: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాటలో 10 మంది మృతి చెందడం పట్ల సిపియం అల్లూరి జిల్లా కమిటీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ మేరకు సిపియం కార్యదర్శి అప్పలనరస ప్రకటన విడుదల చేశారు. మృతుల్లో మహిళలు, చిన్నపిల్లలు ఉండడం విచారకరం. వారి కుటుంబాలకు సానుభూతిని తెలియజేస్నాం. ఈ ఘటనలో అనేకమంది తీవ్రంగా గాయపడ్డారు. చనిపోయినవారి కుటుంబాలకు, గాయపడిన భక్తులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ శనివారం ఏకాదశి కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని తెలిసినా ముందస్తు ఏర్పాట్లు చేయడంలో నిర్వాహకుల వైఫల్యం కనపడుతుంది. ఈ సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం కూడా కనిపిస్తోంది.ఆలయాల్లో భక్తుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



శిథిలావస్థలో ఉపాధ్యాయుల క్వార్టర్స్



రన్నింగ్ వాటర్ లేక నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

గురుకుల పాఠశాలలో సమస్యల తిష్ట

- మరమ్మతుకు నోచని మరుగుదొడ్లు
- ప్రహరీ లేక ఆట స్థలంలో పశువుల సంచారం
- శిథిలమైన క్వార్టర్స్‌లోనే ఉపాధ్యాయుల నివాసం

ప్రజాశక్తి-అరకులోయ: అరకులోయలోని ఆదిమ జాతి గిరిజన గురుకుల(పివిటిజి) పాఠశాలలో సమస్యలు తిష్ట వేశాయి. ఎటు తొంగి చూసినా సమస్యలే దర్శనమిస్తుండడంతో ఒకపక్క విద్యార్థులు, మరోపక్క ఉపాధ్యాయులు కూడా ఇబ్బందులు పడక తప్పడం లేదు.

పిటిజి గురుకుల వసతి గృహంలో 56 మరుగు దొడ్లు నిర్మించారు. సగానికి పైగా(రెండు బ్లాకులు) మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఒక బ్లాక్ లోని మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్ లేక నిరుపయోగంగా మారితే మరో బ్లాక్ లోని మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకొని మరమ్మత్తులకు నోచుకోక ఉన్నాయి. ఈ పాఠశాలలో మూడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు 661 మంది ఆదిమ జాతి విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి సరిపడా మరుగు దొడ్లు లేకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడక తప్పడం లేదు. ఉన్న కొద్దిపాటి మరుగుదొడ్ల లోనే సర్దుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనేకమంది విద్యార్థులు ఆరుబయటే మలవిసర్జనకు వెళ్లవలసిన దుస్థితి ఏర్పడిందని విద్యార్థులు పేర్కొంటున్నారు.

అదేవిధంగా వసతి సమస్య తీవ్రంగా వేధిస్తుంది. బెడ్స్ ఉన్నప్పటికీ బిగించడానికి రూమ్ సరిపోక ఒక్కొక్క మంచానికి ఇద్దరు చొప్పున నిద్రిస్తున్నారు. విద్యార్థులకు సరిపడా డార్మెంటరీ నిర్మించాలని కోరుతున్నారు. తరగతి గదులు కూడా పూర్తిగా మరమ్మతులకు గురై నీరు కారుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వసతి గృహం చుట్టూ ప్రహరీ గోడ లేక పోవడంతో విద్యార్థులకు రక్షణ కరువైంది. గ్రౌండ్ లో పశువులు సంచరిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. పశువుల మధ్యనే విద్యార్థులు ఆటలాడుకోవలసిన పరిస్థితి నెలకొంది.



పశువుల మధ్య ఆడుకుంటున్న విద్యార్థులు

ఉపాధ్యాయులు నివాసముంటున్న క్వార్టర్స్ కూడా పూర్తిగా శిథిల మవ్వడంతో బిక్కుబిక్కుమంటూ ఉపాధ్యాయులు అరచేతుల ప్రాణం పెట్టుకుని కాలం వెల దీయవలసిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1986లో నిర్మించిన క్వార్టర్స్ భవనాలు నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పూర్తిగా మరమ్మతుకు గురై శిథిలమయ్యాయి. ంతో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న 60 మంది టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది ఇబ్బందులు పడక తప్పడం లేదు వర్షాకాలంలో వీరి పరిస్థితి వర్ణనాతీతంగా మారింది.

అదేవిధంగా డ్రైనేజీ సమస్య ఏర్పడడంతో ఆ గ్రౌండ్ లోనే మురుగునీరు పారుతుంది. దీంతో అనేక వ్యాధులు ప్రబలే అవకాశం లేకపోలేదని విద్యార్థులు చెబుతున్నారు. వెంటనే డ్రైనేజీ నిర్మించాలని కోరుతున్నారు.గురుకుల పాఠశాల ప్రాంగణం చుట్టూ అడవిని తలపించే రీతిలో పిచ్చి మొక్కలు పెరిగి ఉండడంతో ఎప్పుడు ఏ విష సర్పం రూములోకి రూములోకి ప్రవేశిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.పాఠశాలకు, వసతి గృహానికి, ఉపాధ్యాయుల క్వార్టర్స్ కు వెళ్లడానికి కూడా సరైన రోడ్డు సౌకర్యం కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల, వసతి గృహం చుట్టూ కూడా అపరిశుభ్రతతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.

ప్రహరీ నిర్మాణానికి ఆటంకం

పి టి జి గురుకులంలో ప్రహరీ గోడ నిర్మాణానికి 30 లక్షల రూపాయలు సాంక్షన్ వచ్చిందని, అయితే బయట వ్యక్తులు కొంతమంది ఆ భూములు తమది అంటూ గొడవలు పెడుతుండడంతో నిర్మాణంలో జాప్యం జరుగుతుంది. డార్మెంటరీ సమస్య ఉన్నప్పటికీ విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా కొంత సర్ది పెడుతున్నాం.



వెంకటరమణ
పి టి జి పాఠశాల ప్రిన్సిపాల్
అరకు లోయ.

మరుగుదొడ్ల నిర్వహణకు డబ్బులేవీ?

మరుగుదొడ్ల నిర్వహణకు డబ్బులు ఇవ్వడం లేదు. మరుగుదొడ్లు కొన్ని పని చేస్తున్నాయి. మరికొన్ని పాడయ్యాయి. ఇంకొన్ని రన్నింగ్ వాటర్ లేక నిరుపయోగంగా ఉన్నాయి. తమకు నెలవారి చెల్లించే ఆరువేల రూపాయల వేతనం కూడా సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. నెల నెల చెల్లించాలి.



లక్ష్మి
మరుగుదొడ్ల నిర్వాహకులు
పి టి జి గురుకులం అరకులోయ

మహిళలకు ఇచ్చిన హామీ అమలు చేయాలి

- రూ.1500 ఇస్తామని చెప్పి ఇప్పుడు మొండిచేయి
- ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ డిమాండ్



జెండా ఆవిష్కరిస్తున్న మహిళా సంఘం జిల్లా నాయకులు చిక్కాల వీరమ్మ



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ

ప్రజాశక్తి- విఆర్‌పురం: ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలకు రూ.1500 ఇస్తామని చెప్పిన హామీని తక్షణమే అమలు చేయాలని ఐద్వా రంపచోడవరం జిల్లా కార్యదర్శి ఐ. పద్మ డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్ పురం మండలం ఉమ్మడివరంలో శనివారం మహిళా సంఘం ఐద్వా మండల 4వ మహాసభ కారం లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా మహిళా సంఘం (ఐద్వా) జెండాను మహిళా సంఘం జిల్లా నాయకురాలు చిక్కాల వీరమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వాజిల్లా కార్యదర్శి పద్మ మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు ఇచ్చిన హామీని అమలు చేయకుండా మొండి చేయి చూపిందని మహిళలకు ఉచిత గ్యాస్ పథకం ఇస్తానని చెప్పి ప్రజలను మభ్యపెట్టిందని కానీ ఆ పథకం ఎవరికి వర్తించట్లేదని ఆమె ఆరోపించారు. అదేవిధంగా విఆర్ పురం మండలంలో చింతూరు నుండి ఏవి గూడెం పెద్దమటపల్లి విఆర్‌పురం రూటులో ఆర్టీసీ బస్సే తిరగడం లేదని ఇంక ఉచిత బస్సు ఎక్కడ ఎక్కుతారన్నారు. మహాసభకు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, మాజీ ఎంపిపి సున్నం నాగమ్మ, సర్పంచులు వెట్టి. లక్ష్మి, పూనెం సరోజిని, కారం బుచ్చమ్మ ఐద్వా నాయకులు ముర్రం రంగమ్మ, సున్నం పార్వతి, నూనె అశ్విని, సోడి రమాదేవి పాల్గొన్నారు.

ప్రత్యేక గిరిజన జిల్లా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- చింతూరు: రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక గిరిజన జిల్లాను ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం చింతూరు సిపిఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ చింతూరు డివిజన్, రంపచోడవరం డివిజన్, పోలవరం డివిజన్లను కలుపుకుని రంపచోడవరం కేంద్రంగా గిరిజన జిల్లాను ఏర్పాటు చేస్తానని గత ఎన్నికల్లో ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఇప్పుడు ఈ ప్రాంతాన్ని తీసుకువెళ్లి తూర్పుగోదావరిలో కలిపే ఆలోచన చేయడం దుర్మార్గమన్నారు. రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక గిరిజన జిల్లాను ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో అందరినీ కలుపుకొని జిల్లా ఏర్పాటు కోసం ప్రజాఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, పల్లపు వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, సీసం సురేష్, పులి సంతోష్, ఐవి, పాయం సీతారామయ్య, మడకం నాగమణి, యర్రంశెట్టి శ్రీనివాస్, మడకం చిన్నయ్య, పొడియం లక్ష్మన్,మల్లం సుబ్బమ్మ, చింతా రాంబాబు, సవలం కన్నయ్య, పత్రా రమేష్, కారం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

220 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి- కొయ్యూరు: మండలంలోని కాకరపాడు జూనియర్ కాలేజీలో విద్యార్థులకు వైద్యశిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా కళాశాలలో 220 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం మందులు పంపిణీ చేసినట్టు రాజేంద్రపాలెం పిహెచ్‌సి సిబ్బంది తెలిపారు. రానున్న వాతావరణ మార్పుల వల్ల విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేస్తూ చేస్తున్నట్టు ప్రిన్సిపాల్ లక్ష్మణుడు తెలిపారు.

ఆదిలక్ష్మి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న జమాల్‌ఖాన్

ప్రజాశక్తి - వీఆర్‌పురం: మండలంలోని రాజుపేట కాలనీకి చెందిన ఆదిలక్ష్మి అనారోగ్య కారణాలతో మృతి చెందింది. బాధిత కుటుంబానికి ఓదార్పుగా శనివారం ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకె సిటీ చైర్మన్ తెలుగుదేశం మండల అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ సందర్శించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల మారేడుమిల్లి ఘాటీలో ప్రమాదానికి గురై మృతి చెందిన ముత్యాల నరేష్ కుటుంబానికి జమాలఖాన్ ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బొర్రా నరేష్, ముత్యాల రామారావు, ఆచంట శ్రీనివాస్, సర్ఫరాజ్, జనసేన మండల అధ్యక్షులు కార్యదర్శి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా చీడిపుట్టు వంతెన

-భయంతో గిరిజనుల రాకపోకలు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని చీడిపుట్టు వంతెనపై నుంచి వరద నీటితో ప్రస్తుతం ప్రమాద స్థితికి చేరుకుంది. మొంథా తుఫాన్ ప్రభావం తగ్గినా, వర్షపు నీరు ఇంకా తగ్గకపోవడంతో ప్రజలు ప్రాణాలను పణంగా పెట్టుకొని రాకపోకలు కొనసాగిస్తున్నారు. శనివారం సంతకు వెళ్లే వారు కూడా భయాందోళనతో వంతెన దాటారు. కొందరు భయంతో ఆగిపోతే, మరికొందరు సమూహంగా దాటి వెళ్లారు. సుమారు 60 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ వంతెన పాతబడి రంధ్రాలు ఏర్పడి, తుఫాన్ ప్రభావంతో సగం భాగం కూలిపోయే స్థితిలోకి చేరింది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించకపోవడంతో వంతెన ప్రమాదానికి నిలయంగా మారింది. వంతెనపై ఏర్పడిన రంధ్రాలను పోలీసు శాఖ ఆధ్వర్యంలో గుర్తించి ఎర్ర గుడ్డలు కట్టారు. ఈ వంతెన మార్గం ద్వారా భరమసి, గడికించుమండ, అడ్డుమండ పంచాయతీ, పాడేరు మండలం మోదపుట్టు, చెక్‌పోస్టు వైపు వెళ్లే వారంతా రాక పోకలు సాగిస్తారు. ఎన్ని సంవత్సరాలు గడిచినా వంతెన పునర్నిర్మాణ పనులు చేపట్టలేని దుస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. "నిధులు మంజూరు చేసి కొత్త వంతెన నిర్మాణం ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు. సిపిఎం మండల నాయకుడు కె.అప్పారావు మాట్లాడుతూ, "చీడిపుట్టు వంతెన కూలిపోయే ప్రమాదం ఉన్నా అధికారులు స్పందించ లేదన్నారు.. వంతెన నిర్మిస్తే అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు సురక్షితంగా మండల కేంద్రానికి రాకపోకలు సాగించవచ్చు అని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



వంతెన పై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు



వంతెన వద్ద హెచ్చరికను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

నిర్వాసితులకు నష్టపరిహారం చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి- విఆర్‌పురం: ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో పోలవరం నిర్వాసితుల కోసం ప్రభుత్వం అందించిన రూ.1000 కోట్ల నష్టపరిహారం చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అధ్యక్షత వహించిన కార్యక్రమానికి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జనసేన పార్టీ వి.ఆర్.పురం మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ ఆధ్వర్యంలో జన సైనికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి.ఆర్. పురం మండల నిర్వాసితుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి తమ మండలంలో నిర్వాసితులకు త్వరగా పరిహారం అందించాలని కోరారు. మంత్రి నిమ్మల స్పందిస్తూ ఈ నెలలో పరిహారం అందించే ఏర్పాట్లు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్, జేసీ, ఆర్అండ్ఆర్ కమిషనర్, భూ సేకరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు బాలికలు అదృశ్యం

కొన్ని గంటల్లోనే క్షేమంగా తీసుకొచ్చిన పోలీసులు

ప్రజాశక్తి- జికె వీధి : మండలంలోని ముగ్గురు గిరిజన బాలికలు అదృశ్యమైన ఘటనలో గూడెంకొత్తవీధి పోలీసుల బృందం స్పందించి గంటల వ్యవధిలోనే వారిని పట్టుకున్నారు. అల్లూరిజిల్లా గూడెం కొత్తవీధి మండలంలో రింతాడ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు వసతిగృహం నుంచి శుక్రవారం ఉదయం అదృశ్యమయ్యారు. పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం అందించి సాయంత్రం వరకూ వెతికారు. వారు దొరకకపోవడంతో సాయంత్రం 6 గంటలకు పోలీసులను ఆశ్రయించారు. చింతపల్లి ఎఎస్‌పి నవజ్యోతి మిశ్రా ద్వారా సమాచారం అందుకున్న జికె వీధి ఎస్సై సురేష్ బృందం గాలింపు చర్యలు చేపట్టారు. పాఠశాలకు వెళ్లి వివరాలు సేకరించి వసతిగృహ సంక్షేమ అధికారిని తీసుకుని విశాఖ వెళ్లారు వెళ్తూనే వాళ్ళు ఎక్కడ ఉన్నారనే దానిపై సమాచారం సేకరించారు. ఆ ముగ్గురు బాలికలు ఆధార్‌కార్డు సాయంతో ఆర్టిసి బస్సులో విశాఖ వెళ్లినట్టు రాత్రి 9 గంటల సమయంలో విశాఖ ఆర్టిసి కాంప్లెక్స్‌లో ఉన్నట్టు గుర్తించారు. దీంతో పోలీసులను అప్రమత్తం చేసి వారిని పట్టుకున్నారు. రాత్రి 11 గంటలకు వారికి అదుపులోకి తీసుకొని తెల్లవారు జామున 4 గంటలకు తిరిగి రింతాడ వసతిగృహానికి చేర్చారు. పోలీసులకు పలువురు అభినందనలు తెలిపారు. రింతాడ బాలికల పాఠశాలను ఏఎస్పి నవజ్యోతి మిశ్రా శనివారం సందర్శించి విద్యార్థినులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలికలు చదువుపై ఆటలపై శ్రద్ధ చూపడంతో పాటు తనకంటూ ప్రత్యేకతను చాటుకునేందుకు ప్రయత్నించాలన్నారు. చెడువ్యసనాలకు బానిసై భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. పిల్లలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో చింతపల్లి ఏటిడబ్ల్యూ జయనాగలక్ష్మి, హెచ్ఎం సుమిత్ర, వసతిగృహ సంక్షేమ అధికారి భవాని, ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బిర్సా ముండా జయంతోత్సవాలను జయప్రదం చేయాలి

-కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు : గిరిజన వీరుడు, స్వాతంత్ర్య సమర యోధుడు ధర్తీ ఆభా భగవాన్ బిర్సా ముండా 150వ జయంత్యుత్సవాలని ఈనెల ఒకటి నుండి పదిహేను వరకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్నటువంటి మూడు ఐటిడిఏ పరిధిలో ఘనంగా జరుపుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ తెలిపారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో గిరిజనుల సేవలను, త్యాగాలను గౌరవించడం ఈ జయంత్యుత్సవాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఐటిడిఏ పాడేరు నుండి కాఫీ హౌస్ వరకు కార్నివాల్‌ను ప్రారంభించారు. పండగ వాతావరణంలో జరిగిన ఈ కార్నివాల్ లో గిరిజన సంస్కృతి , సాంప్రదాయాలను ప్రతిబింబించే విధముగా ధింసాలు, కోలాటాలు గిరిజన కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకొన్నాయి. బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమములో కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి బిర్సా ముండా అని కొనియాడారు. గిరిజన సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను, కాపాడుకోవాల్సిన భాద్యత ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక ప్రత్యేక సంక్షేమ పథకాలు చేపడుతుందని తెలిపారు. ఆరోగ్యం , విద్య , వ్యవసాయం, రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి వాటికి వేల కోట్లు ఖర్చు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధియోగి కర్మయోగి అభియాన్ పథకము ద్వారా జిల్లాలో 521 గ్రామాలకు గ్రామ అభివృద్ధి ప్రణాళికలకు, మౌళిక వసతులు , ఆర్థిక సామజిక అభివృద్ధికి, నాయకత్వ లక్షణాలు పెంపొదించడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని , ఇంకా జిల్లలో 800 గ్రామాలను ఈ పదకములో పరిగణనలోకి తీసుకొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ పివో తిరుమణి శ్రీ పూజ, ట్రైకార్ చైర్మన్ కె.కృష్ణారావు, కాఫీ బోర్డు చైర్మన్ బొర్రా నాగరాజు, పీయమ్‌యూ నాగరాజు, ఐటిడిఏ ఏపివో వెంకటేశ్వర్లు, పాడేరు ఐటిడిఏ పరిపాలన అధికారిణి హేమలత, పలు శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ సత్యవతి, గాలికొండ సర్పంచ్ బుజ్జిబాబు

గూడెంకొత్త వీధి మండలంలోనే కొనసాగించాలి

ప్రజాశక్తి - జీకే వీధి: ధారకొండ మండల కేంద్రంగా ఏ.దారకొండ, గాలికొండ పంచాయతీలు దారకొండలో కలపటం తమకు ఇష్టం లేదని, గాలికొండ, ఏ ధారకొండ, రెండు పంచాయతీలు గూడెం కొత్త వీధి మండల కేంద్రంలోని కొనసాగించాలని దారకొండ సర్పంచ్ ముర్ల సత్యవతి, గాలికొండ సర్పంచ్ కాకూరి బుజ్జిబాబు, వైస్ సర్పంచ్ చంటిబాబు అన్నారు. సమావేశంలో పీసా కమిటీ ఉపాధ్యక్షులు చిలకల కష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



పూడికలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

డ్రైనేజీల్లో పూడికల తొలగింపు

ప్రజాశక్తి -సీలేరు: స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా డ్రైనేజీల్లో పూడికలు తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామని పంచాయతీ కార్యదర్శి పరశురాం సర్పంచ్ దుర్గో వెల్లడించారు. శనివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ సీలేరు మేజరు పంచాయతీ పరిధి రామాలయం వద్ద డ్రైనేజీలో భారీ వర్షాలకు చెత్త పేరుకుపోయిందన్నారు. శనివారం స్పెషల్ డ్రైవ్ పనులు చేపట్టి చెత్త తొలగించామన్నారు. డ్రైనేజీల్లో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలన్నారు.

సక్రమంగా పింఛన్లు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - కొయ్యూరు: లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను సక్రమంగా పంపిణీ చేయాలని కొయ్యూరు ఎంపిడిఒ ప్రసాదరావు పంచాయతీ, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శనివారం కొండగోకిరి పంచాయతీలో పింఛన్ పంపిణిని సర్పంచ్ రేగటి ముసిలినాయుడుతో కలిసి పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి పలువురు లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేశారు. మిగిలిన పెన్షన్లను రేపు ఆదివారం సెలవు కనుక 3వ తేదీ సోమవారం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

జికెవీధి: మండలంలోమొండిగెడ్డ పంచాయతీ గుడివాడ, పెద్దవలస పంచాయతీ టెంట్లువీధి, సంకాడ పంచాయతీ జడుమూరు, చిన్నజడుమూరు, గూడెం పంచాయతీలో గుమ్మల్ల గొందిలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామ కమిటి అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

మలేరియా జోనల్ అధికారి ప్రభావతి



విద్యార్థి ఆరోగ్య సమస్యను తెలుసుకుంటున్న ప్రభావతి

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించవద్దని మలేరియా జోనల్ అధికారిణి డాక్టర్ బి. ప్రభావతి సూచించారు. శనివారం మండలంలోని మలేరియా జోనల్ బృందం పర్యటించింది. కొత్తూరు కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాలలో పర్యటించిన అనంతరం విద్యార్థుల ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిశుభ్రత వంటి వాటిపై ఆరా తీశారు. మలేరియాతో బాధపడుతున్న విద్యార్థుల ఆరోగ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాన్ ప్రభావ కారణంగా మలేరియా వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పాఠశాల చుట్టు ప్రాంతాలలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. ఏంటమాలజిస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ జె వి.ప్రసాద్ మాట్లాడుతూ, చిన్న పాటి జ్వరం వంటి లక్షణాలు ఉన్న విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించాలన్నారు. వ్యాధి లక్షణం ఉన్న వారిని వెంటనే మెరుగైన వైద్యం కోసం ఏరియా ఆసుపత్రికి తరలించాలని సూచించారుఈకార్యక్రమంలో అనంతగిరి వైద్య అధికారి జ్ఞానశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ బాధితులకు నిత్యావసరాలు



సరుకులు ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలో మలయంగార్ క్యాథలిక్ చర్చ్ ఆధ్వర్యంలో తుఫాన్ వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. చర్చి ఫాదర్ స్టీఫెన్ ఆధ్వర్యంలో సొలభం సర్పంచ్ హనుమంతరావు, జి.మాడుగుల సర్పంచ్ కిముడు రాంబాబు చేతుల మీదుగా బాధితులకు బియ్యం, పప్పులు, నూనె, చింతపండు, కారం తదితర సరుకులను శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమణ, మత్స్యరాస రామారాజు, మత్స్యరాస బుజ్జి పాల్గొన్నారు

మెగా దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని పోతంగుడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉచిత మెగా దంత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు..ఈ శిబిరాన్ని ఎంపీడీఓ ప్రేమ్ సాగార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆయా చుట్టూ పక్కల గ్రామాల గిరిజనులతోపాటు చిన్నారులు 200మంది పాల్గొని వైద్య పరీక్షలను చేయించుకున్నారు. విశాఖపట్నంలోని దంత వైద్య నిపుణులు ఉచిత పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంఇఓ ఎస్ సుందర్ రావు,. ఎంఈవో-2 గెన్ను, పీఆర్టీయూ నాయుకులు రమేష్ కుమార్, శ్రీనివాస్, కృష్ణ, లక్ష్మయ్య, రాంప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట

జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్



పింఛను అందజేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-జి.మాడుగుల : అవ్వాతాతల ఆనందం- ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌తో సాకారమవుతోందని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. శనివారం జి.మాడుగుల మండలం పరదేశిపుట్టు, కే కోడపల్లి గ్రామ సచివాలయంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా వేలాది మంది పేద, బలహీన వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. సమయానికి పెన్షన్లు అందేలా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం పేదల సంక్షేమం పట్ల అంకితభావంతో ఉందన్నారు. ఎవ్వరూ వెనుకబడి ఉండకూడదనే సంకల్పంతో ఈ పథకాన్ని బలోపేతం చేస్తోందని ఆయన అన్నారు. అర్హత కలిగి, పెన్షన్ రాని లబ్ధిదారులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 92.46 శాతం పెన్షన్ పంపిణీ జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.మురళి, జి.మాడుగుల తహసిల్దార్ రాజ్ కుమార్, ఎంపీడీవో డేవిడ్ రాజు, సర్పంచ్ మాతే చిలకమ్మా, మాజీ ఎంపీటీసీ సోమేలి జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

గీతంలో రేడియాలజిస్ట్‌ల రాష్ట్ర సదస్సు



డాక్టర్ లక్ష్మిని సత్కరిస్తున్న నిర్వాహక ప్రతినిధులు, అతిథులు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం మెడికల్ కాలేజీలో ఇండియన్ రేడియాలజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ (ఐఆర్ఐఎ) రాష్ట్ర సదస్సు శనివారం ప్రారంభమైంది.సదస్సుకు ముఖ్య అతిథిగా రేడియాలజిస్టు, ఎంపీ డాక్టర్ శబరి బైరెడ్డి పాల్గొనగా, చిన్మయ విశ్వ విద్యాపీఠ్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ముక్కమాల అప్పారావు, ఎపి మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ శ్రీహరిరావు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీ ఎయిమ్స్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజు శర్మకు ప్రతిష్ఠాత్మక కాకర్ల సుబ్బారావు స్వర్ణ పతకం, తిరుపతి ఎస్‌విఐఎంఎస్ డాక్టర్ ఎ.వై. లక్ష్మి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, బెస్ట్ యంగ్ అచీవర్స్‌గా డాక్టర్ కె. సుషేన్‌కుమార్, డాక్టర్ జీవి.మోహన్ ప్రసాద్‌కు బంగారు పతకాలను బహూకరించారు. ఏషియన్ మస్కులో స్కెలెటల్ సొసైటీ అధ్యక్షుడిగా ఎంపికైన విజయవాడ డాక్టర్ వివిఎన్.వరప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ శబరి బైరెడ్డి దేశవ్యాప్తంగా రేడియాలజిస్టులకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను ప్రారంభించారు. డాక్టర్ ముక్కమాల అప్పారావు మాట్లాడుతూ, రేడియాలజీలో కృత్రిమ మేధస్సు, ఆగ్మెంటెడ్ ఇంటెలిజెన్స్ వినియోగం రాబోయే దశాబ్దాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. గీతం ప్రో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ గీతాంజలి బట్నమనే సదస్సుకు రేడియాలజిస్టులను స్వాగతించారు. ఎపి ఐఆర్ఐఎ అధ్యక్షుడు, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ వి.సురేష్ ఆధ్వర్యంలో సెక్రటరీ డాక్టర్ ఉమమహేశ్వరరెడ్డి సమన్వయంతో నిర్వహించిన సదస్సులో విశాఖ కెజిహెచ్ రేడియాలజీ హెచ్ఒడి డాక్టర్ బుజ్జిబాబు, అపోలో ఆసుపత్రుల హెచ్ఒడి ప్రొఫెసర్ ఉమమహేశ్వరరావు, రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి రేడియాలజిస్ట్‌లు, అధ్యాపకులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాయితీని చాటుకున్న దంపతులు

ప్రజాశక్తి-గాజువాక : షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి ఎండీ వ్యక్తిగత సెక్రటరీ అనపర్తి షబీనా అజ్మా నిజాయితీని చాటుకుంది. వివరాల్లోకి వెళితే, కంచరపాలెం చెందిన అనపర్తి షబీనా అజ్మా కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో పనిచేస్తోంది. శనివారం విధులు ముగించుకొని తన భర్తతో బైక్‌పై వెళుతుండగా గాజువాక డిపో సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద మనీ వాలెట్ దొరికింది., అందులో రూ. 25వేలు నగదు ఉన్నట్లు గుర్తించారు. నిజాయితీగా వ్యవహరించిన ఆ దంపతులు, దొరికిన వాలెట్‌ను గాజువాక పోలీస్‌లకు అప్పగించారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు, గాజువాక ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీకి చెందిన దండువోలు సతీష్ కుమార్‌దిగా గుర్తించారు. సతీష్‌కుమార్‌ను పోలీస్‌స్టేషన్‌కు రప్పించి, షబీనా చేతుల మీదుగా వాలెట్‌ను అప్పగించారు. షబీనా దంపతులు నిజాయితీని పోలీసులు అభినందించారు.



బాధితునికి మనీ వాలెట్‌ను అందజేస్తున్న షబీనా

ఉత్తమ సేవలకు ముఖ్యమంత్రి పురస్కారం

పెదబయలు సిడిపిఒకు ప్రశంసా పత్రం అందజేసిన చంద్రబాబు



చంద్రబాబు నుంచి పురస్కారం అందుకుంటున్న సిడిపిఒ స్రవంతి

ప్రజాశక్తి-పెదబయలు : మొంథా తుపాన్ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన పెదబయలు ఐసిడిఎస్ సిడిపిఒ స్రవంతికి సిఎంఒ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా మెమోంటో, ప్రశంసా పత్రం అందజేశారు. మొంథా తుపాన్ సమయంలో పెదబయలు ఐసిడిఎస్ ప్రాజెక్టు సమన్వయంతో గర్భిణులను సురక్షిత ప్రసవాలు నిర్వహణకు చర్యలు తీసుకోవడం జరిగింది. తుపాన్ సమయంలో రవాణా వ్యవస్థ పూర్తిగా నిలిచిపోయినా పెదబయలు మండలంలోని అంతర్గత గ్రామాల నుంచి గర్భిణులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించి సురక్షిత ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టారు. కోరవంగి గ్రామానికి చెందిన బచ్చెలి మహాలక్ష్మిని అక్టోబర్ 29న పడేరు పిహెచ్‌సికు తరలించారు. ఆమె 30న ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. అలాగే కన్నెలకట్టు, కోడంబంద, బంగారుపుట్టు వంటి కొండ, అటవీ ప్రాంతాల నుండి నలుగురు గర్భిణులను ఐసిడిఎస్ సిబ్బంది సమన్వయంతో సురక్షితంగా పిహెచ్‌సికి తరలించి సజావుగా ప్రసవాలు జరగేలా చేశారు. తుఫాన్ సమయంలో అత్యవసర పరిస్థితుల్లో చూపిన అప్రమత్తత, సమర్ధవంతమైన సమన్వయ చర్యలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి శనివారం ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీసులో సిఎం చంద్రబాబు చేతుల మీదుగా సన్మానం జరిగింది.

రాష్ట్ర అవతరణ దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

ప్రజాశక్తి-చింతపల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి పౌరుడూ భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బి.రమణ, జగదీశ్‌బాబు, నాగేశ్వరరావు, సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలోని కొరవంగి పంచాయతీ పరిధి బొడ్డగొంది గ్రామంలో దీర్ఘకాలంగా ప్రజలను పట్టి పీడిస్తున్న తాగునీరు సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామ మహిళలు శనవారం పెద్ద ఎత్తు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి సమస్యపై పలుసార్లు మండల స్థాయి అధికారులకు విన్నవించామని, అయినా అధికార యంత్రాంగం స్పందించలేదని, సమస్యను పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత్యంతరం లేక ఊట గెడ్డ నుండి నీటిని తెచ్చుకొని తాగుతున్నామని, దీని వల్ల రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతిధులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కంచాలని కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

బస్సు సర్వీసులు వెంటనే పునరుద్ధరించాలి

ప్రజాశక్తి -సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యంలో నడిచే నర్సీపట్నం డిపోకు చెందిన నర్సీపట్నం వయా చింతపల్లి జికె వీధి సీలేరు వచ్చే బస్ సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలని ప్రయాణికులు డిమాండ్ చేశారు. తుఫాన్ ప్రభావం పోయినప్పటికీ బస్ సర్వీసులు పునరుద్ధరించడం లేదన్నారు. నర్సీపట్నం- సీలేరు అనకాపల్లి- సీలేరు నర్సీపట్నం- గుమ్మరేవుల బస్ ఆదివారం ఉదయం నుంచి నడిపేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. విశాఖపట్నం డిపో బస్ సర్వీసులు శనివారం నుంచి పునరుద్ధరించారు.

'చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేర్చారు'

ప్రజాశక్తి - కొయ్యూరు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని కొయ్యూరు జిసిసి మాజీ చైర్మన్ ప్రసాద్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మావోయిస్టుల కాల్పుల్లో మాజీ ఎమ్మెల్యేలు కిడారి సర్వేశ్వరరావు, సివేరి సోమ మృతి చెందిన విషయం తెలిసినదే. అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు వారిరువురి కుటుంబాలను పరామర్శించడానికి వెళ్లినప్పుడు వారికి అండగా ఉంటానని ఇరువురి కుమారులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని మాట ఇచ్చారు. దీనిలో భాగంగా సర్వేశ్వరరావు కుమారుడుకు గ్రూప్ 1 డిప్యూటీ కలెక్టర్ పోస్టును గతంలోనే ఇచ్చారని గుర్తు చేశారు. సోమ కుమారుడుకి గ్రూప్ 2 కేటగిరిలో డిప్యూటీ తహశీల్దార్‌గా నియామకరం చేశారు. ఈ సందర్భంగా గిరిజనుల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబుకి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎవ్రీడే యమ్మీ విత్ హెరిటేజ్ పనీర్ ప్రచారం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : హెరిటేజ్ ఫుడ్స్, ఎవ్రీడే యమ్మీ విత్ హెరిటేజ్ పనీర్ ప్రచారాన్ని విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరులలో నిర్వహిస్తున్నట్లు హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ మార్కెటింగ్ విపి పునీత్ కుసుంబియా తెలిపారు. విశాఖలోని ఒక హోటల్లో ఆయన మాట్లాడుతూ, హెరిటేజ్ పనీర్‌తో వంట చేయడం ఎంత సులభమో వివరిస్తున్నట్లు తెలిపారు. రోజువారి భోజనంలో రుచికరమైన, ఆరోగ్యకరమైన మార్గాన్ని అందించాలని తాము కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమానికి అమ్మ చేతి వంట చానల్ భార్గవి సెలబ్రిటీగా వ్యవహరిస్తారని తెలిపారు.

శ్రీ కనకమహాలక్ష్మి మార్గశిర ఉత్సవాల రాట

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పాత నగరంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల రాట కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరై మార్గశిర మాసోత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి కె.శోభారాణి, కార్పొరేటర్లు గోడి విజయలక్ష్మి, నరసింహచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆరుద్ర శత జయంతి సభ

- హాజరుకానున్న తెలకపల్లి రవి

ప్రజాశక్తి : విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరానికి చెందిన ప్రముఖ అభ్యుదయ కవి ఆరుద్ర శత జయంతి సభ ఆదివారం ఉదయం 10 గంటలకు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. చీకటి దివాకర్ అధ్యక్షతన నిర్వహించే సభలో ప్రముఖ రచయిత, విశ్లేషకులు తెలకపల్లి రవి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, వక్తలుగా సాహితీవేత్తలు అట్టాడ అప్పలనాయుడు, కెంగార మోహన్, ఉప్పల అప్పలరాజు పాల్గొంటారని తెలిపారు. అనంతరం సాహితీ స్రవంతి నాయకులు నూనెల శ్రీనివాసరావు, ఎవి.రమణారావు సంస్మరణ సభ జరుగుతుందని, సాహితీ స్రవంతి నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'తిమిరాన్ని తరిమేస్తాం' పుస్తక ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు.

శామ్‌సంగ్ వాలెట్‌లో 'డిజిటల్ కార్ కీ'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శాంసంగ్ వాలెట్ ద్వారా మహీంద్రా ఎలక్ట్రిక్ ఆరిజిన్ ఎస్‌యువిల కోసం 'డిజిటల్ కార్ కీ' సదుపాయాన్ని అందిస్తున్నట్లు విశాఖపట్నంలోని మహీంద్రా కార్యాలయంలో మహీంద్రా ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నళినీకాంత్ గొల్లగుంట తెలిపారు. ఎస్‌యువిల యజమానులు తమ స్మార్ట్‌ఫోన్‌లను ఉపయోగించి వాహనాలను అన్‌లాక్, లాక్ చేయడానికి, స్టార్ట్ చేయవచ్చని వివరించారు. వినియోగదారులు తమ 'డిజిటల్ కార్ కీ'ని స్నేహితులు, కుటుంబ సభ్యులతో పరిమిత కాలానికి పంచుకోవచ్చని, అవసరమైనప్పుడు యాక్సెస్‌ను నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ఈ ఫీచర్ శామ్‌సంగ్ నాక్స్ అందించే డిఫెన్స్-గ్రేడ్ సెక్యూరిటీ ఉంటుందని తెలిపారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి

ప్రజాశక్తి - రంపచోడవరం : గిరిజన హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన ఆదివాసీ వీరుడు భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయంలో జాతీయ గౌరవ దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిర్సా ముండా చిత్రపటానికి ఐటిడిఎ పిఒ స్మరణ్ రాజ్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎస్. బొజ్జిరెడ్డి, ఎస్టీ కమిటీ డైరెక్టర్ గొర్లె దేబోరా సునీత, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సాయి ప్రశాంత్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిఒ మాట్లాడుతూ 'బిర్సా ముండా గిరిజన హక్కుల కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నవంబర్ 1నుండి 15 వరకు అధికారికంగా జయంతిని జరపాలనడం గిరిజనులకు గౌరవకరమైన విషయం అన్నారు. ఎస్టీ కమిటీ డైరెక్టర్ గొర్లె దేబోరా మాట్లాడారు. ఈ సందర్భంగా వెలుగు, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో 36 మంది రైతులకు పవర్‌టిల్లర్లు, 12 లక్షల విలువైన 100 ఆయిల్‌ఇంజిన్లు సబ్సిడీపై పంపిణీ చేశారు. బ్రిటిష్ వ్యతిరేక పోరాట యోధుడు బంధాల చంద్రయ్య వారసులు ద్వార బంధాల సత్యనారాయణ, ద్వార బంధాల నాగదుర్గ స్వామిలను ఘనంగా సత్కరించారు. అనంతరం ఐటిడిఎ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సాయిప్రశాంత్, డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, తహసిల్దార్ బాలాజీ, వైద్యాధికారులు శిరీష, డేవిడ్, వెలుగు ఏపిడి దేగలయ్య, హెచ్‌డిఎఫ్‌సి మేనేజర్ మురళీకృష్ణ, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, సిడిపిఒలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్

జలవిద్యుత్ కేంద్రంలో విజిలెన్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎపి జెన్‌కో సిబ్బంది

ప్రజాశక్తి -సీలేరు: ఎపి జెన్కో విద్యుత్ సంస్థ విజిలెన్స్ ఎస్పీ ఆదేశాల మేరకు విజిలెన్స్ ఎవేర్‌నెస్ ప్రొగ్రామ్ అక్టోబర్ 27 నుంచి నవంబర్ 2 వరకు నిర్వహించనున్నట్లు ఎపి జెన్కో సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ కోటీశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు జలవిద్యుత్‌కేంద్రంలో ఎపి జెన్కో సెక్యూరిటీ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎపి జెన్కో ఎస్‌సి సివిల్ చంద్రశేఖం రెడ్డి, ఇఇ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారన్నారు.

అవినీతికి ఆస్కారం లేకుండా బాధ్యతాయుతంగా విధి నిర్వహణ చేపట్టాలని ప్రతిజ్ఞ చేసామన్నారు. స్థానిక డిఎవి పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామని ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఇఇ సివిల్ ఇంచార్జ్ జైపాల్, పంపు స్టోరేజీ ప్రాజెక్టు ఇఇ భాస్కర్‌రావు ఎడిఇ అప్పలనాయుడు ఏపీ జెన్కో ఎకౌంటు ఆఫీసర్ సత్యనారాయణ ఇంజనీర్లు కార్మికులు డి ఏ వి ప్రధానోపాధ్యాయులు కిరణ్‌కుమార్ జెన్కో సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాసితులపై అలసత్వం ఎందుకు..?

ఎటపాక మండలం ముంపు జాబితాలో ఉందా లేదా..!

పోలవరం నిర్వాసితుల జెఎసి

ప్రజాశక్తి ఎటపాక: మండలానికి సంబంధించిన పోలవరం నిర్వాసితులు సమస్యలపై మండలంలో పలువురు అఖిలపక్ష నాయకులు జెఎసిగా ఏర్పడి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాఘవయ్య మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పోలవరం ముంపునకు గురవుతున్న 7 విలీన మండలాల్లో భాగంగా భద్రాచలం రూరల్ మండలాన్ని నెల్లిపాక మండలంగా మార్చి విలీనం చేయడం జరిగింద న్నారు. నాటి నుంచి నేటి వరకూ మండలంలో ప్రజలు పరిపాలన పరమైనటువంటి సౌలభ్యం లేక జిల్లా కేంద్రంకు, డివిజన్ కేంద్రానికి వెళ్లాలంటే వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా విద్య,వైద్యం కోసం తెలంగాణ ప్రాంతాల మీద ఆధార పడాల్సి వస్తోందని, అసలు పోలవరం ముంపు లో ఎటపాక మండలం ఎ కాంటూరు లెవెల్‌లో ఉందో ప్రాజెక్టు అధికారులు స్పష్టం చేయాలని కోరారు. ఒకవేళ పోలవరం ముంపులో మండలం లేనిపక్షంలో నిర్వాసితులకు న్యాయం చేయలేని పక్షంలో తిరిగి యధావిధిగా భద్రాచలం రూరల్ మండలాన్ని తెలంగాణలో కలపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పట్ల మండలాలు అఖిలపక్ష నాయకులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. సమస్యలను జెఎసి ద్వారా ఢిల్లీ వరకూ సమస్యను తీసుకెళ్తామన్నారు. సమావేశంలో తానికొండ శ్రీనివాస్, జుట్టుపాక బాలకృష్ణ పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం అందించాలి

ప్రజాశక్తి -సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం ధారకొండ పంచాయతీ పెట్రాయిలో మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన పంట పొలాలను గిరిజన సమైక్య మండల కార్యదర్శి పాంగి నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో రాగులు, సామలు పంటలు పూర్తిగా నేలమట్టం అయ్యాయని రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలిందని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు పరిశీలించి నష్టపరిహారాన్ని చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

సిఐఐ సదస్సు ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖ వేదికగా ఈ నెల 14, 15 తేదీలలో నిర్వహించే సిఐఐ భాగస్వామ్య సదస్సు ప్రధాన వేదికకు విచ్చేయు అతిథిలకు, ప్రతినిధులకు అవసరమయ్యే మౌలిక వసతుల ఏర్పాట్లను త్వరతగతిన పూర్తి చేయాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. సిఐఐ భాగస్వామ్య సదస్సు కోసం ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్‌లో చేస్తున్న ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, దేశ విదేశాల నుండి సుమారు 3000 మంది ప్రతినిధులు, అతిథులు ఈ సదస్సుకు విచ్చేస్తున్నట్లు తెలిపారు. గ్రౌండ్ లెవెలింగ్, విఐపిల పార్కింగ్ ప్రాంతం, సదస్సు జరిగే ప్రాంగణంలో అంతర్గత రోడ్లను పరిశీలించి పనులు ఎప్పటికీ పూర్తవుతాయని అధికారులను, సిఐఐ ప్రతినిధులను ఆరా తీశారు. సదస్సు జరిగే ప్రాంతంలో మొక్కలతో ఆకర్షణీయంగా పనులు పూర్తి చేయాలని డిడిహెచ్ దామోదరావును ఆదేశించారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజినీర్లు శాంతిరాజు, శ్రీనివాసరావు, కార్యనిర్వాహక ఇంజినీర్ గంగాధరరావు ఏపీ అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తా

- ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తన నియోజకవర్గంలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తానని దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. మనోరమ థియేటర్ సాయిబాబా ఆలయం వద్ద శనివారం జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే అధికారుల సమక్షంలో పరిష్కరించారు. పరిష్కారం కాని అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల వద్దకు స్వయంగా వెళ్లి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం తనకు ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. ఎవరికి ఎటువంటి సమస్య ఉన్నా తనను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జోన్-4 కమిషనర్ మల్లయ్యనాయుడు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, జివిఎంసి, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విశాఖకు రైల్వే జోన్ గెజిట్ విడుదల చేయాలి

లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి



మాట్లాడుతున్న లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు ఈ ఏడాది జనవరి 8న దేశ ప్రధాని మోడీ శంకుస్థాపన చేసి 10 నెలలు కావస్తున్నా నేటికీ కొత్త జోన్ గెజిట్ విడుదల చేయకపోవడం సరికాదని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌కు లోక్‌సత్తా రాసిన లేఖను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్ గెజిట్‌ను విడుదల చేయకుండా కేంద్రం ఎందుకు తాత్సారం చేస్తుందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. గెజిట్ విడుదల చేయటానికి 10 నెలలు సరిపోలేదా అని ప్రశ్నించారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీభరత్, సిఎం రమేష్ త్వరగా గెజిట్ విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో లోక్‌సత్తా నేతలు ఎమ్ఎస్ఎన్.మూర్తి, ఇప్పలవలస గోపి, తుమ్మగంటి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.